GSTIN-NO:36FKPSI308PIZX
epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 6 | సంచిక : 351 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | మంగళవారం : ఆగస్టు-13-2024 | పేజీలు : 3

## 2.74 లక్షల మందికి రైతు బీమా

### -అగస్ట్ 15నుండి వర్తింపు

**టీ మీడియా,అగస్ట్ 12,హైదరాబాద్ :**

నిరుపేద రైతుల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ సర్కార్ రైతు బీమాపై ఫోకస్ పెట్టింది. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 2024-25 సంవత్సరానికి గాను ఆగస్టు 15 నుంచి రైతు బీమా పథకాన్ని పునరుద్ధరించనుంది. 18 నుంచి 59 ఏళ్ల వయసు గల వారు ఈ పథకానికి అర్హులని ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రంలో మొత్తం 75.86 లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు ఉండగా.. గతేడాది జూన్ వరకు మరో 3.22 లక్షల మందికి కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చినట్లుగా వ్యవసాయ శాఖ గుర్తించింది. అందులో 2.32 లక్షల మంది మాత్రమే రైతు బీమాకు దరఖాస్తు చేసుకున్నారు. గతంలో అన్ని అర్హతలు ఉండి రైతు బీమాకు దరఖాస్తు చేసుకోని వారితో కలిపి 2.71 లక్షల మంది అర్హులని తేల్చారు. అదేవిధంగా జూలై 30 నాటికి 60 ఏళ్లు దాటిని వారిని పథకం నుంచి తొలగించి మిగతా అర్హులైన 45.13 లక్షల మంది ఇన్సూరెన్స్‌లను రెన్యూవల్ చేయాలని అధికారులు నిర్ణయించారు. వాటికి తోడు కొత్తగా అర్హులైన 2.74 లక్షల మందికి కలిపి మొత్తం 47.87 లక్షల మంది రైతులను ప్రభుత్వం రైతు బీమాలో భాగస్వాములను చేయనుంది. ఏడాదికి ఒక్కో రైతుకు రూ.3,600 చొప్పున సర్కారే ప్రీమియం చెల్లిస్తుంది. రైతు సహజంగా లేదా ప్రమాదవశాత్తు మరణించినా ఆ కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం అందనుంది.





## తెలంగాణలో హ్యుందాయ్

# కొత్త మెగా టెస్టింగ్ సెంటర్

- ఇంజనీరింగ్ సెంటర్ విస్తరణకూ పెట్టుబడులు పెరగనున్న ఉద్యోగ అవకాశాలు
- ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చలు

**ప్రపంచ ప్రఖ్యాత హ్యుందాయ్ మోటార్స్ సంస్థ తన సరికొత్త మెగా టెస్టింగ్ సెంటర్ ను తెలంగాణలో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. భారీ ఎత్తున ఏర్పాటు కానున్న మెగా టెస్టింగ్ సెంటర్‌లో ఆటోమేటివ్ టెస్ట్ ట్రాక్ సదుపాయంతో పాటు అత్యాధునిక టెస్ట్ కార్ల తయారీ సౌకర్యం ఉంటుంది. దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని బృందం హ్యుందాయ్ మోటార్స్ ప్రతినిధులతో ఈ మేరకు చర్చలు జరిపింది.హ్యుందాయ్ మోటార్స్ అనుబంధ హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా తెలంగాణలో మెగా టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది. అలాగే హైదరాబాద్‌లో ఇప్పటికే ఉన్న ఇంజినీరింగ్ కేంద్రాన్ని ఆధునీకరించి, విస్తరించడానికి కూడా పెట్టుబడులు పెట్టనున్నట్లు హ్యుందాయ్ మోటార్స్ తెలిపింది.**

**టీ మీడియా,ఆగస్టు 12,హైదరాబాద్ బ్యూరో :**

తెలంగాణలో ఇప్పటికే ఉన్న ఇంజనీరింగ్ సెంటర్ విస్తరణతోపాటు కొత్తగా మెగా టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం ఆసియా పసిఫిక్ ప్రాంతంలో తమ వ్యాపార విస్తరణకు ఎంతో కీలకమని హ్యుందాయ్ మోటార్స్ ప్రతినిధులు తెలిపారు. ఇలాంటి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి హ్యుందాయ్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రపంచ దిగ్గజ కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు అనుకూలమైన వాతావరణం, ప్రభుత్వం విధానాలు తెలంగాణలో ఉన్నాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. హ్యుందాయ్ మోటార్స్ సంస్థ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో సీఎంతోపాటు పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు , ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. తెలంగాణలో హ్యుందాయ్ మెగా టెస్టింగ్ సెంటర్ ఏర్పాటు ద్వారా అనుబంధ సంస్థలు కూడా రానున్నాయి. తద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగానూ భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.





## టూరిజం అభివృద్ధి కి

# ప్రభుత్వం సిద్ధం

### డిప్యూటీ సీఎం మల్లు భట్టీ, మంత్రులు జూపల్లి, పొంగులేటి

**టీ మీడియా, ఆగస్టు 12, నెలకొండపల్లి (ఖమ్మం జిల్లా ):**

టూరిజం అభివృద్ధి కి ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. సోమవారం నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెంలోని బౌద్ధ స్థూపాన్ని రాష్ట్ర టూరిజం, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి లతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పర్యాటక ప్రాంతాలకు ప్రాచుర్యం కల్పించి, ప్రపంచ పటంలో తెలంగాణను నిలపడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని అన్నారు. దక్షిణ ఆసియాలో అతిపెద్ద బౌద్ధస్తూపమని ఆయన తెలిపారు. నిధుల కొరత లేదని, ప్రణాళికా ప్రకారం చర్యలు చేపడతామని ఆయన అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బౌద్ధ ప్రచారకులను ఆహ్వానించాలని, మన బౌద్ధ పర్యాటక ప్రాంతాలను ప్రపంచ పటంలో నిలపాలని ఆయన తెలిపారు. బౌద్ధుల పండుగలు చూసి నేలకొండపల్లి లో ఉత్సవాలు నిర్వహించాలని, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బౌద్ధ ప్రచారకులను ఈ ఉత్సవాలకు ఆహ్వానించాలని ఆయన అన్నారు. ఇప్పటికే రూ. 10 కోట్ల నిధులు మంజూరు చేశామని, పనులు ప్రారంభించాలని, సమస్యలుంటే దృష్టికి తేవాలన్నారు. ప్రస్తుతం ఉన్నవాటిని కాపాడుకుంటూ, పాత ఆనవాళ్లు వెలికితీసి రక్షణ చర్యలు చేపట్టాలని, రోడ్డు వ్యవస్థను మెరుగు పర్చాలని, సమగ్ర ప్రణాళిక చేసి, బౌద్ధులను భాగస్వామ్యం చేసి అభివృద్ధి కి చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, బౌద్ధ స్తూపం 1 వ శతాబ్దం లోనిదని, దక్షిణ భారతదేశంలో అతి పెద్దదని అన్నారు. 8 ఎకరాల విస్తీర్ణంలో ఉందని, దీనిని అభివృద్ధి చేస్తే, గొప్ప పర్యాటక

మిగతా 3లో..

## రామగుండం లో

# టికెట్ల పంచాయతీ....

- ఆందోళనలో పాత క్యాడర్...
- కొత్తగా చేరిన వారికి ఇస్తారా..? మొదటి నుంచి కష్టపడ్డ వారికి ఇస్తారా..?
- ఈసారి మరో 10 డివిజన్లు పెరిగే అవకాశం..
- మేయర్ బీసీ జనరల్ అయ్యే ఛాన్స్..



**టీ మీడియా, ఆగస్టు 12,గోదావరిఖని ప్రతినిధి:**

రామగుండం కార్పొరేషన్ లో ప్రధాన పార్టీలలో అప్పుడే టికెట్ల పంచాయతి మొదలైంది. అధికార కాంగ్రెస్, బీ ఆర్ ఎస్ తో పాటు ఈసారి బీజేపీ పార్టీ నుంచి కూడా ఆశావాహులు ఎక్కువయ్యారు. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల అనంతరం రామగుండం లో ఆయా పార్టీల రాజకీయ స్వరూపం పూర్తిగా మారింది. పదేళ్లు అధికారం చేలాయించిన బీ ఆర్ ఎస్ ప్రతిపక్ష పాత్ర పోషిస్తుండగా, కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చాక తమ క్యాడర్ ను పెంచుకుంది. అసెంబ్లీ ఎన్నికల ముందు గట్టి బలగం తో ఉన్న బీ ఆర్ ఎస్ లోకి వలసలు జరిగి అనంతరం అధికారం చేజారాక అవ్వే వలసలు కాంగ్రెస్ వైపు తిరిగాయి. ప్రస్తుతం ఉన్న కార్పొరేటర్లు కూడా అంత కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. తమ రాజకీయ భవిష్యత్ దృష్ట్యా అధికార పార్టీ లో చేరారు. అయితే బీ ఆర్ ఎస్ ను సంఖ్య బలం తో దెబ్బటియాలని టార్గెట్ గా చేసుకొని ముందు వెనుకాల చూడకుండా ఆ పార్టీ నుండి ముఖ్యమైన కార్పొరేటర్లను హైదరాబాద్ కు పిలిపించుకొని కాంగ్రెస్ పార్టీ లో చేర్పించుకున్నారు. ఇక్కడ వరకు బాగానే ఉన్నా... ఇదే ఇప్పుడు ప్రస్తుతం అధికార పార్టీ కి సవాల్ గా మారింది. చాలాకాలంగా కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేస్తూ భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్న పాత క్యాడర్కు ప్రాధాన్యత ఇస్తారా..? లేదంటే కొత్తగా పార్టీలో చేరిన కార్పోరేటర్లకే మళ్లీ టికెట్లు ఇస్తారా..? ఇదే జరిగితే పాత క్యాడర్ నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందా..? లేదంటే పాత క్యాడర్కు టికెట్లు ఇచ్చి కొత్త వారిని బుజ్జగింపులు చేస్తే సర్దుకుంటారా..? లేదంటే మళ్లీ ఆ పార్టీ నుంచి బయటకు వస్తారా..? అన్న ప్రశ్నలు వెంటాడుతున్నాయి. నవ్విపోతురుగాక మాకేటి సిగ్గు అన్నట్టుగా టిఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోగానే.. ఆగమేఘాల మీద ఆ పార్టీ ముఖ్య నాయకులు, కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలోకి దూకారు. వీరి రాజకీయ వ్యవహారం చూసి రామగుండం కార్పొరేషన్ ప్రజలు విస్తు పోయారు. వచ్చే ఎన్నికల్లో వీరికి ఓట్లతో బుద్ధి చెప్తారా..? అని బాహాటంగానే చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా... రామగుండం కార్పొరేషన్ లో ప్రస్తుతం 50 డివిజన్లో 2.29 లక్షల ఓటర్లు ఉండగా, జనాభా, విస్తీర్ణం ప్రాతిపదికన మరో 10 డివిజన్లు పెంచి 60 డివిజన్లు గా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిసింది. ఆ లెక్కన నగరపాలక సంస్థ మేయర్ స్థానం బీసీ జనరల్ గా చేస్తారని భావిస్తున్నారు. అయితే ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమైన కార్పొరేటర్ ఒకరు వచ్చే ఎన్నికల్లో మేయర్ పీఠం దక్కించుకునేందుకు పావులు కదుపుతుండగా, ఒకవేళ మేయర్ బీసీ జనరల్ అయితే తన పరిస్థితి ఏమిటని స్థానిక ప్రజా ప్రతినిధి దృష్టికి తీసుకువెళ్లి ఎలాగైనా ఎస్సీ రిజర్వేషన్ ఖరారు అయ్యేలా చూడాలని సూచిస్తున్నట్లు తెలిసింది. అయితే కార్పొరేషన్ లో ఆయా డివిజన్ల సంఖ్య పెంచడం గాని, రిజర్వేషన్లు ఖరారు చేయడం గాని స్థానిక శాసనసభ్యులు పరిధిలో ఉంటుంది. ఇదిలా ఉండగా ఇటీవల లోక్సభ ఎన్నికల్లో బిజెపి పార్టీకి కూడా కొంత గ్రాఫ్ పెరగడంతో ఆ పార్టీ నుంచి కూడా ఆశావాహులు టికెట్ల కోసం ఇప్పటినుంచే ప్రయత్నాలు చేస్తున్నట్లు కనబడుతున్నది. మొత్తానికి అధికార కాంగ్రెస్ పార్టీ టికెట్ల గోల ఆ పార్టీకి తలనొప్పిగా మారినట్లు తెలుస్తోంది.

# భక్తుల సమస్యలకు పరిష్కారం చూపండి

- కలెక్టర్ కు వినతి..
- ఆలయ పరిరక్షణ సమితి సభ్యులు..

**టీ మీడియా, ఆగస్టు 12, మహానంది:** మహానంది క్షేత్రానికి వచ్చే భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలని సోమవారం నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా కు ప్రజా సమస్యల ఐక్య వేదిక కార్యక్రమంలో భాగంగా శ్రీ మహానందీశ్వర పరిరక్షణ సమితి సభ్యులు కాకర్ల శివ, పన్నెంగి వెంకటరమణ, దూదేకుల మురళి లు. వినతి పత్రం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహానంది క్షేత్రంలోని ఎం.పీ.పోచా బ్రహ్మానందరెడ్డి భక్తుల కోసం నిర్మించిన విశ్రాంతిభవనం, భక్తులకు వినియోగించాలని అన్నారు. భక్తులకు మూత్రశాలల ఏర్పాట్లలో అధికారులు నిర్లక్ష్యంగా వహించడం తగదన్నారు. భక్తులు ఆలయంలోనికి వెళ్లి దర్శనం అనంతరం, కోదండ రామాలయం నుంచి వచ్చే దారిలో నవగ్రహాల వద్ద గేటు వేసి, భక్తులను ఇబ్బందులు గురిజేయడం అన్యాయం అన్నారు. ఆంజనేయ స్వామి ఆలయం వద్ద తాయేతులు, నిమ్మకాయలు విక్రయించడం సబబా అన్నారు. హొటల్స్ వద్ద, క్షేత్ర ఆవరణలో చెత్త డబ్బాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆలయంలో వేద పరాయణం చేయు యాగశాల వద్ద, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని, వేద పారాయణం ప్రతినిత్యం పటించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు . మహానంది గ్రామపంచాయతీ పరిధిలోని ఫంక్షన్ హాల్స్ వద్ద డస్ట్ డబ్బాలు ఏర్పాటు చేయాలని,ఇంకా క్షేత్రంలో పలు సమస్యలు పరిష్కరించాలని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి,వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు.



## ముంపు గ్రామల సమస్యలు తీర్చాలి

- ప్రజావాణిలో వినతిపత్రం

**టీ మీడియా, ఆగస్టు 12,వెల్గటూర్ :** మండలం చెగ్యాం గ్రామ ముంపు సమస్యల పైన బిజెపి అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు ఆధ్వర్యంలో చెగ్యాం గ్రామస్తులకు ముంపు బాధితుల సమస్యల పైన జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొమ్ము రాంబాబు సమస్యల పైన మాట్లాడుతూ ఎల్లంపల్లి ప్రాజెక్ట్ లొ ముంపు గ్రామమైన చెగ్యాం లొ పోయిన, భూములు ఇండ్ల పరిహారం ఆర్ అండ్ ఆర్ ప్రభుత్వ భూమి పట్టా పంపిణి చేయాలని ఏండ్లు గడిచిన గ్రామస్థులకు ఇంతవరకు కొంతమందికి పరిహారం అందలేదని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ముంపు బాధితులకు పరిహారం అందివ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలొ ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు, ఎండపల్లి మండలం బీజేపి పార్టీ మండల అధ్యక్షుడు రావు హన్మంతరావు, ఎండపల్లి మండలం బీసీ సంక్షేమ సంగం అధ్యక్షుడు మందపల్లి శ్రీనివాస్, వెల్గటూర్ మండల బీసీ సంక్షేమ సంగం పసుపునిటీ అనిల్, రైతులు ఆర్ అండ్ ఆర్ బాధితులు కున్నారపు రాజేశం భూమయ్య మల్లయ్య యాదగిరి మేడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ప్రారంభమైన శిక్షణ తరగతులు

**టీ మీడియా, ఆగస్టు 12,పెద్ద దోర్నాల :** దోర్నాలలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు గ్రామ పంచాయతీ అభివృద్ధిపై శిక్షణ తరగతులు సోమవారం ఎంపీడీఓ నాసర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ తరగతులకు దోర్నాల మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీ అభివృద్ధిపై పలు సూచనలు చేశారు. 3 రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాసర్ రెడ్డి తెలిపారు.



## దోర్నాల డిగ్రీ కళాశాలలోఅధ్యాపక పోస్టులకు ఆహ్వానం

**టీ మీడియా, ఆగస్టు 12, పెద్ద దోర్నాల :** పెద్ద దోర్నాల. లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్, బోటనీ మరియు కంప్యూటర్ సైన్స్ బోధించుటకు అతిధి అధ్యాపకులను ఆహ్వాని స్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్. సావిత్రి తెలియ చేసారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్.మాట్లాడుతూ... కనీసం 55% మార్కులు కలిగి ఎన్ .ఈ. టి./ ఎస్. ఈ. టి. ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని, అర్హత కలిగిన వారు 21- ఒకటవ తేదీన తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో ఇంటర్వ్యూ కి ఆహ్వాని స్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాలలో ప్రిన్సిపాల్ డా ఎస్ సావిత్రి తెలిపారు.



## అన్నప్రసాదా వితరణకు విరాళం

**టీ మీడియా, ఆగస్టు 12, మహానంది:** మహానంది పుణ్యక్షేత్రంలో నిత్యం భక్తుల కోసం అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి భక్తుడు విరాళం అందజేశారు. సోమవారం కడప జిల్లా జమ్మలమడుగు మండలం శేషారెడ్డిపల్లె గ్రామానికి చెందిన ఎం.శివరాజారెడ్డి నిత్య అన్నదానానికి టెంపుల్ ఇన్స్పెక్టర్ శశిధర్ రెడ్డికి విరాళంగా రూ.20,000 అందజేశారు. అన్నదానానికి విరాళం అందజేయగా, వారికి స్వామివారి ప్రసాదంతో పాటు, బాండును అందజేశారు.



### మొదటి పేజీ తవారు

## టూరిజం అభివృద్ధి కి ప్రభుత్వం సిద్ధం

ప్రాంతంగా మారుతుందని అన్నారు. ఇక్కడ బుద్దిస్ట్ మ్యూజియం ఏర్పాటు చేయాలని, అభివృద్ధి కి సంబంధించిన సమగ్ర రిపోర్ట్ తయారు చేయాలని అన్నారు. అండర్ గ్రౌండ్లో ఆనాటికి సంబంధించిన శిలలు ఉన్నాయని ఆయన తెలిపారు. సహజసిద్ధమైన జీవకళ ఉండి, అన్ని వసతులు ఉన్నాయని అన్నారు. దేశంలోనే గొప్ప పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి పర్చాలని అన్నారు. అభివృద్ధి కి కావలసిన నిధులు మంజూరు చేస్తామని మంత్రి అన్నారు. నేలకొండపల్లి భక్తరామదాసు జన్మించిన స్థలమని, మ్యూజియం గా భక్తరామదాసు మందిరం అభివృద్ధి చేయాలని, టూరిస్ట్ లను ఆకర్షించేందుకు అన్నిరకాల ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో రిజర్వాయర్ ఉందని, పాలేరు రిజర్వాయిర్, భక్తరామదాసు, బౌద్ధ స్తూపాలను అభివృద్ధి చేస్తే ప్రాంతంలో టూరిజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్ శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. బయటి దేశాల నుండి బౌద్ధులను రప్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి నెలలో మంత్రులు, శాసనసభ్యులు ఒకరోజు ఒక పర్యాటక ప్రాంతానికి వెళ్లేలా కార్యాచరణ చేయాలన్నారు. దీంతో పర్యాటకంపై ప్రచారం కలిగి, ప్రజల్లో ఆసక్తి పెరుగుతుందన్నారు. పర్యాటక ప్రాంతాల సందర్శనతో ఆలోచన విధానం మారుతుందన్నారు. బౌద్ధస్తూపం, భక్తరామదాసు ఇల్లు దగ్గర అభివృద్ధి పనులు, నీటి వనరుల్లో బోటింగ్, టాయిలెట్లు, హొటల్ తదితర ఏమేం పనులు చేపట్టాలో సమగ్ర నివేదిక పొందుపర్చి ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ చేపట్టనున్నట్లు ఆయన అన్నారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలాగా అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి అన్నారు.

అనంతరం ఉపముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీ లతో కలిసి భక్త రామదాసు గృహాన్ని సందర్శించారు. తెలుగు వాగ్గేయకార ఆద్యులు, భద్రాచల శ్రీ సీతారామ దేవస్థానం నిర్మించిన భక్త రామదాసు (కంచర్ల గోపన్న) నాలుగు శతాబ్దాల కిందట జీవించిన నేలకొండపల్లిలోని ఆయన స్వగృహాన్ని, పక్కనే నిర్మాణంలో ఉన్న నూతన ధ్యాన మందిరాన్ని ఖమ్మం సందర్శించారు. భక్త రామదాసు వినియోగించిన బావిని పరిశీలించారు. అప్పటి విశేషాలను అర్చకులు, స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ రమేష్ రెడ్డి, జిల్లా అధికారులు, పర్యాటక శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## స్పీడ్ పెంచిన ఆపరేషన్ హైడ్రా

-నిర్మాణాలను ఎక్కడికక్కడే కూల్చివేత..

**టీ మీడియా,ఆగస్టు 12,హైదరాబాద్ బ్యూరో :** హైడ్రా యమా స్పీడు మీదుంది. తెలంగాణ రాష్ట్ర ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా దూసుకెళ్తోంది. చెరువులు, కబ్జా స్థలాల్లోని నిర్మాణాలను నిర్దాక్షిణ్యంగా కూల్చిపడేస్తోంది. రాజకీయ నేతల బిల్డింగులను సైతం బద్దలు కొడుతోంది హైడ్రా టీమ్. సీఎం రేవంత్ రెడ్డి చైర్మన్‌గా, రంగనాథ్ కమిషనర్‌గా పనిచేస్తున్న హైడ్రా.. ఈ అక్రమ కట్టడాల కూల్చివేతను పాతబస్తీ నుంచే ప్రారంభించింది. చెరువులు, కబ్జా స్థలాల్లో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ ఆక్రమణదారుల గుండెల్లో నిద్రపోతోంది. ఫిర్యాదులు అందిన వెంటనే స్పందిస్తూ చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చురుకుగా వ్యవహరిస్తున్నారు. పాతబస్తీ హసన్ నగర్ కింగ్ కాలనీలో.. చెరువును కబ్జా చేసి అక్రమ కట్టడాలను కడితే.. హైడ్రా వాటిని కూల్చేసింది. అక్రమ కట్టడాలు రాజకీయ నాయకులకు చెందినవైనా సరే.. ఏమాత్రం వెనక్కి తగ్గట్లేదు హైడ్రా. బిల్డింగులను కూల్చివేస్తుంటే అడ్డుకోవడానికి వచ్చిన బహదూర్‌పురా ఎమ్మెల్యే మహమ్మద్ ముబీన్‌ను పోలీకసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక కార్పొరేటర్‌తో పాటు పలువురిని అదుపులోకి తీసుకుని మరీ.. కూల్చివేతలను కంటిన్యూ చేశారు అధికారులు. మొత్తం 13 మల్టీ స్టోరీడ్ బిల్డింగులు, 40 కాంపౌండ్ వాల్స్‌ను భారీ యంత్రాలతో కూల్చివేశారు. కింగ్ కాలనీలో ఆక్రమణలకు గురైన ఈ చెరువును 1770 సంవత్సరంలో అప్పటి హైదరాబాద్ ప్రధానమంత్రి నవాబ్బమ్ రుకునుత్ దౌలా తన పేరు పైనే ఏర్పాటు చేశారు, కాలక్రమేణా ఆ 104 ఎకరాల చెరువు కబ్జా కోరల్లో చిక్కుకుని చాలా వరకు చిక్కిపోయింది. ఇప్పుడు ప్రభుత్వ రికార్డుల్లో మిగిలి ఉన్న చెరువును కాపాడు కునేందుకు అధికారులు ప్రయత్నాలు మొదలుపెట్టారు, చెరువులు, ప్రభుత్వ భూములను కాపాడుకునేందుకు పాతబస్తీ నుంచే అధికారులు యుద్ధం ప్రకటించారు. హైదరాబాద్ పాతబస్తీ అక్రమ కట్టడాల కూల్చివేతపై బహదూర్‌పూర్ ఎంఐఎం ఎమ్మెల్యే మహ్మద్ మొబిన్ స్పందించారు.. స్థానికంగా ఉన్న ప్రజలు భూములు కొనుక్కుని అనుమతులు తీసుకునే ఇళు కట్టుకున్నారన్నారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండానే అధికారులు కూల్చివేశారని మండిపడ్డారు, అవి నిజంగా ఎఫ్ టి ఎల్ భూములైతే కట్టుకోవడానికి అధికారులు ఎందుకు అనుమతి ఇచ్చారని ప్రశ్నించారు. ఇక చందానగర్ సర్కిల్ హఫీజ్‌పేట్ డివిజన్ వైశాలి నగర్ లో ల్యాండ్‌లో అక్రమంగా నిర్మిస్తున్న మూడు భవనాలను గుర్తించిన హైడ్రా అధికారులు%ఔ%వాటిని కూల్చివేశారు. ఈ కూల్చివేత పనులు కూడా డే అండ్ నైట్ నాన్‌స్టాప్‌గా జరుగుతున్నాయి. లోటస్ పాండ్ నుంచి మొదలైన అక్రమ నిర్మాణాలకు కూల్చివేత క్రమక్రమంగా స్పీడ్ అందుకుంది. గాజులరామారం చెరువులో 51 నిర్మాణాలను కూల్చివేశారు. నందగిరి హిల్స్, గురు బ్రహ్మ నగర్ లో వెలసిన 17 తాత్కాలిక అక్రమ నిర్మాణాలను జేసీబీలతో తొలగించారు. చందానగర్ సర్కిల్ మదీనాగూడ ఈర్ల చెరువు ప్రాంతంలో మూడు మల్టీ స్టోరేజ్ బిల్డింగ్స్ కూల్చి వేశారు. చెరువుల ఆక్రమణలను అడ్డుకోకపోతే హైదరాబాద్ భవిష్యత్ ప్రశ్నార్థకం అవుతుందన్నారు హైడ్రా కమిషనర్ రంగనాథ్. బఫర్ జోన్‌లో ఎవరూ స్థలాలు కొనుగోలు చేయవద్దని సూచించారు. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేస్తే హైడ్రా చర్యలు తప్పవని హెచ్చరించారు. చెరువులను కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టాలంటే భయపడే పరిస్థితి తీసుకొస్తామన్నారు.

## ఎకరాకు రూ.మూడు లక్షలు పరిహారం ఇవ్వండి

ఎపి జెన్‌కో గేటు ఎదుట సిపిఎం ధర్నా

**టీ మీడియా,అగస్ట్ 12,నెల్లూరు :** నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం, నేలటూరు గ్రామ పరిధిలోని ఎపి జెన్‌కో యాష్ పాండు కట్టకు గండిపడి పంట పొలాలు, రొయ్యల చెరువులు నాశనమై, నష్టపోయిన రైతులకు ఎకరాకి రూ. మూడు లక్షలు నష్టపరిహారం చెల్లించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ముత్తుకూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఏపి జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రం గేటు ఎదుట భాదిత రైతాంగంతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ యాష్ పాండ్ కారణంగా నష్టపోయిన రైతు కుటుంబాలను ఆదుకొని దేనికి పనికి రాకుండా పోయిన ఈ భూములను ఎపి జెన్‌కో యాజమాన్యం నష్టపరిహారం చెల్లించి ఆ భూములు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాష్ పాండ్‌కు చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలకు రూ. 25 వేలు నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు. దేవర దిబ్బ గిరిజన కాలనీ నేలటూరు హరిజనవాడ, నేలటూరు పాలెం గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి ఉందన్నారు. గతంలో భూములు పోయి ఉన్న బాధితులకు ఎపి జెన్‌కో లో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని పైనాపురం దేవర దిబ్బ మిట్టపాలెం నేలటూరి గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి జెన్‌కో థర్మల్ విద్యుత్తు కేంద్రం తాత్కాలిక సిఇకి వినతిపత్రం అందజేశారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు తనకు అధికారం లేదని, రెగ్యులర్ సిఇగా ఒక అధికారి బాధ్యతలు స్వీకరిస్తారని, వారి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని సిఇ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోగుల శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గడ్డం అంకయ్య, టిపి గూడూరు మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య, కాల్తి రెడ్డి రమణమ్మ, పార్టీ ముత్తుకూరు మండల కమిటీ సభ్యులు పట్టపు జయరామయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి దుంపల ఏడుకొండలు, రైతులు పాల్గొన్నారు.




## నీరు -చెట్టు బిల్లుకు మోక్షం!

-రూ.80 కోట్ల బకాయి చెల్లింపు

-సిఎఫ్ఎంఎస్ అప్‌లోడ్‌కు పరుగు

**టీ మీడియా,అగస్ట్ 12,కడప ప్రతినిధి:** ఎట్టకేలకు నీరు-చెట్టు బిల్లు చెల్లింపులకు మోక్షం లభించింది. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌లో నీరు-చెట్టు పథకం పెండింగ్ బకాయి చెల్లింపులకు రూ.250 కోట్లు కేటాయించింది. 2014-2019 టిడిపి ప్రభుత్వ హయాంలోని నీరు-చెట్టు పెండింగ్ బిల్లుల చెల్లింపులకు ప్రాధాన్యత ఇచ్చింది. ఈనేపథ్యంలో నీరు-చెట్టు పథకం కింద పనులు చేసిన పలువురు కార్యకర్తలు పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం సిఎఫ్ఎంఎస్‌లో తమ పనులు అప్‌లోడ్ చేసుకునేందుకు పరుగులు తీస్తుండడం గమనార్హం. నీరు-చెట్టు బిల్లుల చెల్లింపుల ప్రక్రియ ఊపందుకుంది. జిల్లా నీటిపారుదలశాఖ 2018-19లో రూ.120 కోట్లతో కూడిన పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. 2019 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికారం చేతులు మారింది. వైసిపి ప్రభుత్వం ఏర్పడగానే నవరత్నాల అమలుకు ప్రాధాన్యత ఇచ్చింది. టిడిపి ప్రభుత్వ హయాంలోని 1,690 పనులకు సంబంధించిన రూ.80 కోట్ల బిల్లుల చెల్లింపులను నిర్లక్ష్యం చేసింది. ఫలితంగా నీరు-చెట్టు పనులు చేసిన కార్యకర్తలు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. 2019 డిసెంబర్‌లో టిడిపి అధ్యక్షులు చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా నీరు-చెట్టు బిల్లుల చెల్లింపులకు హైకోర్టును ఆశ్రయించి 12 శాతం వడ్డీతో సహా చెల్లింపులు చేయిస్తామని హామీనిచ్చిన సంగతి తెలిసిందే. అనంతరం ఆర్థిక సామర్థ్యం కలిగిన కొంత మంది బిల్లుల చెల్లింపుల కోసం హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాల మేరకు మూడేళ్లుగా నీరు-చెట్టు పనులకు సుమారు రూ.15 కోట్ల మేరకు బిల్లులు చెల్లింపులు చేయించుకున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో నీరు-చెట్లు బిల్లుల చెల్లింపులకు మోక్షం లభించింది. కూటమి సర్కారు నీరు-చెట్టు చెల్లింపులకు బడ్జెట్‌లో రూ.250 కోట్లు కేటాయింపులు చేసింది. ఉమ్మడి కడప జిల్లాలోని 1690 పనుల్లో 800 పనులకు రూ.40 కోట్లు మేరకు చెల్లింపులు చేసింది. 2024 సెప్టెంబర్ నాటికి మిగిలిన సుమారు 800 పనులకు సంబంధించిన రూ.40 కోట్లను నీరు-చెట్టు పనులు చేసిన వారికి చెల్లింపులు చేయనున్నారు. జిల్లాలో నీరు-చెట్టు పనులు చేసిన కార్యకర్తలు




## 16న హైదరాబాద్‌కు ఉప రాష్ట్రపతి..

-ఏర్పాట్లపై సీఎస్ శాంతి కుమారి సమీక్ష

**టీ మీడియా,అగస్ట్ 12,హైదరాబాద్ :** ఈ నెల 16వ తేదీన ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ హైదరాబాద్ పర్యటనకు రానున్నారు. ఈ నేపథ్యంలో ఉప రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సమీక్ష నిర్వహించారు. ఉప రాష్ట్రపతి పర్యటనకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులను సీఎస్ ఆదేశించారు. ఉప రాష్ట్రపతి ప్రయాణించే దారుల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని రోడ్లు, భవనాల శాఖకు సీఎస్ సూచించారు. అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని టీజీఎస్పీడీసీఎల్ ఎండీని ఆదేశించారు. అదే విధంగా అగ్నిమాపక శాఖ విభాగం తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారుఈ సమావేశంలో డీజీపీ జితేందర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, ప్రొటోకాల్ డైరెక్టర్ వెంకట్ రావు, ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి, టీజీఎస్పీడీసీఎల్ ఎండీ ముషారఫ్, ఐ అండ్ పీఆర్ శాఖ స్పెషల్ కమిషనర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు



## 15 రోజుల్లో మా భవిష్యత్తు కార్యాచరణ

-ప్రభుత్వంపై తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఫైర్

**టీ మీడియా,అగస్ట్ 12,హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతుంది.. కానీ ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు కాలేదని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ మండిపడింది. 15 రోజుల్లో మా భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ తేల్చిచెప్పింది. ఇవాళ హైదరాబాద్‌లో అన్ని ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఏర్పడింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జేఏసీ ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఆనాడు తెలంగాణ ఉద్యమం కోసం ఏ విధంగా జేఏసీ ఏర్పాటు చేయడం జరిగిందో ఇప్పుడు మళ్లీ అదే విధఃగా జేఏసీ ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ ప్రభుత్వం వచ్చి 9 నెలలు అవుతుంది.. పీఆర్సీ, డీఏ ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టారు.. కానీ దానిపై స్పందన లేనే లేదు. గతంలో రెండు డీఏలు ఇవ్వకుంటేనే ధర్నాలు చేసేవాళ్లం. కానీ ఇప్పుడు నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ వెంటనే అమలు చేయాలి. ఈ విషయాన్ని కాంగ్రెస్ మేనిఫెస్టోలో కూడా పెట్టింది. హెల్త్ స్కీం వెంటనే అమలు చేయాలి. గత ప్రభుత్వం మాకు కంట్రిబ్యూషన్ కింద హెల్త్ స్కీం చేస్తాం అన్నారు.. జీవో కూడా వచ్చిందని ఉద్యోగ సంఘాల ప్రతినిధులు గుర్తు చేశారు.



### ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం..

ఉద్యోగ సంఘాలతో సమావేశం అవుతామని ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు చెప్పారు. ఇప్పుడు తమ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, సీఎం సిద్ధంగా లేనట్లు అనిపిస్తుంది. భాగ్యనగర్ సొసైటీ, ఇతర సొసైటీ భూములను మాకు అప్పగించాలని కోరుతున్నాము. 15 రోజుల్లో మా భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తాం. అన్ని జిల్లాలో తిరిగి అందరిని కలుపుకొని ముందుకు పోతాం. మా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలని మాత్రమే మేం కోరుతున్నాం అని పేర్కొన్నారు.

### జీతాలు ఒకటో తేదీన రావడం లేదు..

ఒకటో తేదీన జీతాలు ఇస్తున్నారు.. కానీ ఇంకా కొన్ని డిపార్ట్‌మెంట్‌ల్లో జీతాలు ఒకటో తేదీన రావడం లేదు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి. మా న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి. సమస్యలు పరిష్కారం చేయకుంటే మా కార్యాచరణ ప్రకటిస్తాం. మా సమస్యలపై అందరిని కలుస్తాం. గురుకుల పాఠశాలలో సమస్యలు వెంటనే పరిష్కారించాలి. ఉమ్మడి రాష్ట్రంలో మాదిరి ఈ జేఏసీ పని చేస్తోంది అని ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు.



## శిథిలావస్థలో ఆ ప్రాజెక్టు..

-పక్క రాష్ట్రానికి తరలిపోతున్న సాగునీరు..

**టీ మీడియా, ఆగస్టు 12,జహీరాబాద్ :** అక్కడ సాగునీటి వసతే లేదు. భూగర్భ జలాలూ అంతంత మాత్రమే. కానీ, ఆ ప్రాంతంలో ఒక ప్రాజెక్ట్ ఉంది. అందులోకి వచ్చిన నీటిని ఒడిసిపట్టుకోలేక పోతున్నారు. మన రాష్ట్రం వదిలేసిన నీటితో కర్నాటక రాష్ట్రం ఏకంగా ఒక ప్రాజెక్టునే నిర్మించింది.. ఇంతకీ ఈ పరిస్థితి ఎక్కడుంది..? ఎందుకా పరిస్థితి ఏర్పాడింది. అర్థ శతాబ్దం చరిత్ర గల ఆ ప్రాజెక్టు ఎందుకు ఇలా మారిపోయిందో ఇప్పుడు చూద్దాం. ఆ ప్రాంతంలో ఎండాకాలం వచ్చిదంటే పంటలకు సాగు నీరుండదు. వర్షం పడితేనే పంట పండేది. భూగర్భ జలాలు కూడా అతంత మాత్రమే. బంగారంలాంటి భూములున్నా.. సాగునీరు లేక ఇబ్బందులు పడాల్సిందే. ఇలాంటి పరిస్థితిలో జహీరాబాద్ ప్రాంత రైతులకు ఓ ఒయాసిస్సులా ఉంది నారింజ ప్రాజెక్టు. ప్రతి ఏటా రెండు నుండి నాలుగు టిఎంసిల నీరు ఈ వాగులో ప్రవహిస్తుంది. కానీ, ఇందులో ఒక్క చుక్క కూడా ఈ ప్రాంతానికి ఉపయోగపడదు. దీనికి కారణం పూడిక తీయకపోవడం. దీని బాగుకోసం ప్రభుత్వలకు ఎన్నిసార్లు ఈ ప్రాంత రైతులు మొరపెట్టుకున్నా ప్రయోజనం శూన్యం. నారింజ ప్రాజెక్ట్‌లో ఉండాల్సిన నాలుగు టిఎంసిల నీరు ఏమవుతుందని ప్రశ్నిస్తే.. అధికారుల నుండి సమాధానం ఉండదు. జహీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని నారింజవాగు కోహీర్లో పుడుతుంది. కోహీర్, ఝరాసంగం, జహీరాబాద్ మండలాల మీదుగా ప్రవహించి కర్నాటకలోకి వెళ్లుతుంది. అక్కడి నుండి మంజీరా నదిలో కలిస్తుంది. దీనిపై జహీరాబాద్ మండలం కొత్తూరు.బి వద్ద నారింజ డ్యాం నిర్మించారు. 2 నుంచి 3 టిఎంసిల సామర్థ్యంలో దీనిని నిర్మించగా 6 వేల ఎకరాలకు సాగునీరు అందివ్వాలన్నది దీని లక్ష్యం. 1970 డిసెంబర్ 20న దీని నిర్మాణం పూర్తైంది. ఆ తరువాత దీనిని ఎవరూ పట్టించుకోలేదు. 2.3 టిఎంసిల సామర్థ్యమున్న ప్రాజెక్టు కాస్తా.. అర టిఎంసికి చేరింది. పూడిక భారీగా చేరడంతో నీటి నిలువ సామర్థ్యం భారీగా పడిపోయింది. ఉన్న నీరైనా అలాగే ఉంటుందా అంటే అదీ లేదు. డ్యాం గేట్ల మెయింటనెన్స్ సరిగా లేకపోవడంతో వచ్చిన నీరంతా కర్ణాటకకు వెళ్లిపోతుంది. ప్రతి ఏటా రెండు టిఎంసిల నుండి నాలుగు టిఎంసిల నీరు పక్క రాష్ట్రంమైన కర్ణాటకకు వెళ్లిపోతోంది. ఇక్కడ ఉన్న ప్రభుత్వాలు నారింజ ప్రాజెక్టు నీటిని పట్టించుకోలేదు కానీ, కర్ణాటక రాష్ట్రం మాత్రం ఈ నీటిని ఒడిసి పట్టుకుంది. దీంతో ఏకంగా కర్ణాటకలో కారింజ పేరున 9 టిఎంసిల ప్రాజెక్టును నిర్మించింది. దీని ద్వారా ఆ ప్రాంతంలో భారీగా సాగు, తాగునీటికి వాడుకుంటోంది. ఫలితంగా నారింజ నుండి తిరిగి మంజీరాలోకి నీరు చేరడం లేదు. దీన్ని గమనించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం నారింజ ప్రాజెక్ట్ రిపేరు చేయడనికి కొంత నిధులను విడుదల చేసింది. కానీ ఇక్కడ ఉన్న అధికారులు ఎవ్వరు కూడా సరిగ్గా పనిచేయలేదు. దీని కారణంగా నారింజ ప్రాజెక్టులోని నీరు మొత్తం ఎల్లప్పుడు పక్క రాష్ట్రం అయిన కర్ణాటకకు వృథాగా పోతున్నాయి. ఈ నారింజ ప్రాజెక్టు కింద 6 వేల ఎకరాలు సాగుకావాల్సిఉంది. 50 సంవత్సరాలు గడుస్తున్నా కాలువల నిర్మాణం మాత్రం పూర్తి కాలేదు. నిజంగా చెప్పాలంటే నిర్మాణం కూడా ప్రారంభము కాలేదు. ఫలితంగా ఒక ఎకరా కూడా సాగులోకి రాలేదు. నీరు నిలువ ఉంటే కనీసం భూ గర్భ జలాలు అయినా పెరిగేవి.. గేట్లు సరిగా లేకపోవడంతో నీరంతా వృధాగా వెళ్లిపోతుందని అంటున్నారు స్థానికులు. దేవుడు వరం ఇచ్చిన పూజారి అడ్డు పడినట్లు.. గేట్ల మరమ్మతుల కోసం గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన ఎదో మొక్కుబడిగా పనులు ప్రారంభించారు అధికారులు. కానీ, ఆ పనులు మధ్యలో వదిలివేశారు. ఈ మధ్య కాలంలో వర్షాలు బాగా కురుస్తున్నాయి. ఈ నారింజ ప్రాజెక్టులోకి నీరు కూడా భారీగా వచ్చి చేరింది. కానీ గేట్ల మరమ్మతులు చేయకపోవడంతో, పక్క రాష్ట్రానికి మళ్ళీ 2 టిఎంసిల నీరు తరలిపోవడం ఖాయం అంటున్నారు స్థానికులు. జహీరాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రానికి ఏర్పాటు చేసిన హైవేను ఆనుకొని ఉన్న ఈ ప్రాజెక్టు 7 గేట్లు ప్రమాదం అంచున ఉన్నాయి. ఈ గేట్లు పూర్తిగా శిథిలావస్థకు చేరడమే కాకుండా ప్రాజెక్టుపై నిర్మించిన బ్రిడ్జి (రోడ్డు) కూలిపోయే పరిస్థితిలో ఉంది. అదే జరిగితే హైవే రోడ్డు పూర్తిగా తెగిపోయి పెను ప్రమాదం సంభవించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతానికి ప్రాజెక్టులో నీటి నిల్వ బాగానే ఉంది. అయితే ఇప్పుడున్న కట్టకు రిపేర్లు చేయకుంటే అది ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అలాగే జహీరాబాద్ మున్సిపాలిటీ, రేజింతల్, మల్కాపూర్, దిండి, కొత్తూరు, మిర్జాపూర్ పరిసర ప్రాంతాల్లోని డ్రైనేజీ నీరంతా ఈ ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో పశువులు కూడా ఈ నీటిని తాగలేకపోతున్నాయి. మరి కొంతకాలం ఇలాగే వదిలేస్తే హైదరాబాద్ మూసి నదిని తలపించనుంది ఈ నారింజ ప్రాజెక్టు. అలాగే నారింజ ప్రాజెక్టులో పూడికతీత పనులు చేపట్టి కట్ట ఎత్తును పెంచాల్సి ఉంది. మూడేళ్ల క్రితం కొంతమేర పూడికతీత పనులు చేపట్టినా.. ప్రస్తుతం ప్రాజెక్టు ఎత్తు మీటరు కంటే ఎక్కువ ఉండదు. దీనికి తోడు జహీరాబాద్ పరిసర గ్రామాల నుంచి వచ్చే మురుగునీరు మొత్తం ఈ ప్రాజెక్టులో చేరుతుంది. ఇంకొన్ని రోజులు ఇలాగే వదిలేస్తే ప్రాజెక్టు మొత్తం మురుగు నీటితో నిండిపోతుందని అంటున్నారు స్థానికులు. అప్పుడు ఎంత నీరు ఉన్నా రైతులకు ఉపయోగకరంగా ఉండదు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి.. ఈ ప్రాజెక్టును బాగుచేయలని కోరుతున్నారు అక్కడి రైతులు.



## ప్రజావాణి కి 35 ఫిర్యాదులు

-జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్

**టీ మీడియా,అగస్ట్ 12,గద్వాల :** ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులకు ఆదేశించారు. సోమవారం ఐడిఓసి సమావేశం హాలులో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని వివిధ సమస్యలపై వచ్చిన ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో వారికి తగిన సూచనలు ఇవ్వాల్సిందిగా అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం మొత్తం 35 ఫిర్యాదులు అందాయని, వచ్చిన దరకాస్తులను పెండింగ్ ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ శ్రీనివాస రావు, ఆర్డీఓ రాంచందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.